# ప్రతిబింబము

సంతుల విశ్వనాథము గారు

మందిరప్రాంగణమున నుద్యానవన మున్నది. కొలదిదూరమున పుష్కరిణీతీరమున శిలాఫలకముపై నొకబాలికకూర్చుండెను. అంతటను సూర్యకాంతి తేజరిల్లుచున్నది. ఆమనోజ్ఞకాంతివలన నాతటాకసలిలంబులు రుచిరతేజోవిలసితములై యుండెను. ఆకస్మికముగ నాబాలికామణి తరళనయనము లొక్కసారి నిర్మలసలిలగతమైన తన ప్రతిబింబముపైఁ బ్రసరింపఁజేసెను. ఆప్రతిబింబమందలి తనమనోజ్ఞసౌందర్యము తన్మయహృదయముతోఁ దిలకించి వేఱొకబాలికయని భావించి ప్రేమపూర్వకముగ నీరంబుల తొంగిచూచి యాబాలికతో కలిసి యాడుకొనదలచి యాతటాకజలంబుల దిగుచుండెను. ఆప్రతిబింబము గూడ మెల్లన కదలిపోవుట గాంచి యవ్యక్తమధురకంఠస్వరమున నిట్లనియెను. "బాలికా! నేను నిన్ను సమీపింపఁదలచుకొలఁది నీవు దూరమగుచుంటివి. పోనిమ్ము—యిచ్చటనుండియే నిన్ను చూచుచుండెదను." అని యాబాలిక తిరిగి తన శిలాఫలకముపై నాసీనయై స్వస్వరూపమును దదేకదృష్టి నీక్షించుచు హృదయానందముద్రితముగ జేయుచుండెను. సూర్యుడస్తమించెను. విశ్వప్రపంచమంతట చీకటి క్రమక్రమముగ వ్యాపించుచుండెను. నీలజలసమంచితమగు నాపుష్కరిణియందిక నాబాలికామూర్తి మనోమోహనకరమగు ప్రతిబింబమగుపడుట లేదు. బాలిక సంశయదృష్టులతో తటాకజలములవంక దిలకించుచు విచారహృదయముతో "బాలికా! నిన్నత్యంతానురాగమున చూచుచున్న నన్ను నీవేల మోసము చేసి నాకగపడుట మానినావు? ఎట్లైన నిన్ను వెదకి పట్టుకొనెదను." అని యాదివ్యప్రేమమూర్తియగు బాలికయు నిబిడాంధకారబంధురమగు విశ్వధాత్రిని "బాలికా!"యను వజ్రస్తంభిత తీక్ష్ణకంఠస్వరముతో ననంతవినీలాకాశమ్మునందు ప్రతిధ్వనింపఁజేసి యదృశ్యయయ్యెను.